సాక్షి ఖమ్మం

సోమవారం, 29, సెప్టెంబర్, 2025



వాణిజ్య పంటలకు స్వస్తి..

ఖర్చులు పెరిగి దిగుబడి తగ్గుతుండడంతో రైతులు వాణిజ్య పంటలకు స్వస్తి చెప్పి ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నారు. 8లో



అవగాహన కల్పిస్తూ 'మారథాన్'

మరో 24 గంటల్లో రిటైర్డ్ కాబోతున్న ఓ పోలీస్ అధికారి 21 కిలో మీటర్ల ఆఫ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం

32° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో సాయంత్రం చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

బంధాలను పెంచే బతుకమ్మ

పుట్టింట్లో జరుపుకోవడం ఆనందం



కెనడా దేశంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. బతుకమ్మ వేడుక అంటే ఎంతో ఇష్టం. అమ్మవారి ఇంట్లో ఈ పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది. బతుకమ్మ, దసరా పండుగలు, పుట్టింటి వారిని, స్నేహితులను, బంధువులను అందరిని కలిసి సంతోషాలు పంచుకోవటం కోసం సెలవుపై వచ్చా. బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకుంటున్నాం.

– ఆకుల అనూష, వాసవీనగర్, ఖమ్మం

ఎంతో ఆనందంగా ఉంది



సౌదీ అరేబియా రియాద్‌లో ఉద్యోగ రీత్యా ఉంటున్నాం. అత్తగారి ఊరు ఖమ్మం నగరం జమ్మిబండ. ప్రతి ఏడాది బతుకమ్మ వేడుకలకు వస్తాం. జమ్మిబండలో నిర్వహించే వేడుకల్లో బంధువులు, స్నేహితులతో కలిసి పాల్గొంటాం. ఆటపాటలతో బతుకమ్మ సంబురాలు జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది. ప్రతి ఏటా ఈ వేడుకకు రావటం సరదాలను పంచుతుంది.

– బండారు వినీల, జమ్మిబండ, ఖమ్మం

సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



ఉద్యోగ రీత్యా అమెరికా డల్లాస్, టెక్సాస్‌లో ఉంటున్నాం. పూల పండుగ బతుకమ్మ అంటే ఇష్టం. బతుకమ్మ, దసరాతో పాటు కుటుంబం, స్నేహితులతో కొద్ది రోజులు గడిపి వెళ్లడానికి వచ్చాం. బతుకమ్మను రకరకాల పూలతో పేర్చి తీసుకువెళ్లి బంధువులు, స్నేహితులతో ఆటపాటలతో గడపటం ఆనందంగా ఉంటుంది. ఇవి మరపురాని జ్ఞాపకాలు.

– బాలిని శ్రావ్య, మోతీనగర్, ఖమ్మం



బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతున్న మహిళలు

పూల పండుగకు ఎల్లలు దాటి వస్తున్న మహిళలు

- బంధుత్వం, స్నేహానికి ప్రాధాన్యత
- కలిసికట్టుగా ఆటపాటలతో వేడుకలు
- మగువల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే అతి పెద్ద పండుగ, మహిళల ప్రత్యేక పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను పూలతో పేర్చి ఆటపాటలతో సాగే సంబురాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. సాగనంపే సద్దుల బతుకమ్మను పోయిరావమ్మ, మళ్లీ రావమ్మా అంటూ ఊరూ వాడ అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. సోమవారం జరుపుకునే సద్దుల బతుకమ్మకు ఇళ్లన్నీ మహిళలతో కళకళలాడుతున్నాయి. బతుకమ్మ వేడుకలను పుట్టింట్లో జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. కొందరు ఏ ప్రాంతంలో ఉన్నా, పొరుగు రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉన్నా బతుకమ్మ పండుగ కోసం పుట్టింటికి వచ్చి వేడుకలు నిర్వహిస్తుంటారు. పుట్టి పెరిగిన ఊరు, కలిసి చదువుకున్న స్నేహితులు, బంధువులతో ఆనందంగా గడపడానికి మహిళలు ప్రాధాన్యత ఇస్తారు. పుట్టింటి వారే గాక పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చిన కోడళ్లు సైతం అత్తవారి ఇంట్లోనే ఉండి బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఏ పండుగకు తల్లిగారింటికి వెళ్లినా బతుకమ్మ పండుగకు మాత్రం అత్తవారి ఇంట్లో ఉండి పూల పండగను జరుపుకోవాలని భావిస్తున్నారు. స్నేహితులు, బంధువులతో కలిసి పరిసర ప్రాంతాల్లో, పచ్చిక బయళ్లలో పూలు కోసుకువచ్చి బతుకమ్మలను పేర్చుతారు. ప్రతి రోజు సాయంత్రం అందమైన దుస్తులు, పట్టు వస్త్రాలు ధరించి బతుకమ్మలను మోస్తూ బ్యాండ్ మేళాలు, డీజే సౌండ్స్, కోలాటాలతో పాటలు పాడుతూ, ఆటలాడుతూ సమీప దేవాలయాలు, జలాశయాల వద్దకు చేరుకొని గౌరమ్మను పూజిస్తూ బతుకమ్మ పాటలతో సంబురాలు జరుపుకుంటున్నారు. సోమవారం జరుపుకునే సద్దుల బతుకమ్మ కోసం విదేశాల నుంచి పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు మహిళల అభిప్రాయాలతో ప్రత్యేక కథనం..

ఇది ప్రకృతి పండుగ..



వృత్తి రీత్యా ఐటీ ప్రొఫెషనల్. చెన్నైలో కుటుంబంతో ఉంటున్నాం. నాన్న ఖమ్మంలోని అయ్యప్ప ఆలయంలో ప్రధాన పూజారి. ప్రతి బతుకమ్మ వేడుకకు ఖమ్మం వస్తా. ప్రకృతి ప్రసాదించిన పూలతో బతుకమ్మను పేర్చి పూజలు చేయటం మంచి సంస్కృతి. పూలను బతుకమ్మగా పేర్చి ఆటపాటలతో మహిళలు సంబురాలు చేసుకోవటం ఓ అనుభూతి. నేను కూడా ఈ వేడుకల్లో పాల్గొంటా. ఇక్కడ స్నేహితులతో ఆనందాలు పంచుకుంటాం.

– నమిత, దాబాలబజార్, ఖమ్మం

ఈ సంస్కృతి ఎంతో గొప్పది



అమ్మగారి ఊరు ఏపీలోని తెనాలి. అత్తగారి ఊరు ఖమ్మం. సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేసేది బెంగళూరు. బతుకమ్మ వేడుకలకు తప్పక ఖమ్మం వస్తాం. బతుకమ్మ పండుగ బంధాలను పెంచుతుంది. ఈ సంస్కృతి ఎంతో గొప్పది. మహిళలు పూలను పూజించటం ఓ మంచి సంప్రదాయం. అత్తగారింట్లో ఈ వేడుకలను జరుపుకోవడం మరుపురాని ఆనందాలను ఇస్తుంది. ఈ పండుగ స్నేహితులు, బంధువులను పెంచుతుంది. – రాళ్లబండి మౌనిక, వరంగల్ క్రాస్‌రోడ్, ఖమ్మం

ఏటా తప్పకవస్తాం



చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంచేస్తున్నా. ఖమ్మంలో అమ్మవారి ఇంటికి బతుకమ్మ వేడుకలకు రావటం ఆనందంగా ఉంది. ప్రతి ఏటా వస్తుంటాం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ఈ పండుగకు ఆదరణ పెరిగింది. ఖమ్మంలో ఈ వేడుకకు గుర్తింపు పెరగడం ఆనందంగా ఉంది.

– హరి నిహారిక, రోటరీనగర్, ఖమ్మం

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నారాయణపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క

బోనకల్ : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బోనకల్ మండలం జానకీపురం, నారాయణపురం గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జానకీపురంలో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణపురంలో బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.3.33 కోట్లతో రావినూతల – చిన్నబీరవల్లి బీటీ రోడ్డు పనులకు, తూటికుంట్ల ఎస్సీ కాలనీలో రూ.66 లక్షలతో నిర్మించే అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. చింతకాని మండలంలో రూ.6.95 కోట్లతో నిర్మించే మత్కేపల్లి – తిర్లాపురం రోడ్డు పనులు, నాగిలిగొండ ఎస్సీ కాలనీలో రూ.85 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, పాతర్లపాడు ఎస్సీ కాలనీలో రూ.85 లక్షలతో, కోమట్లగూడెం ఎస్సీ కాలనీలో రూ.70 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, తిమ్మినేనిపాలెం ఎస్సీ కాలనీలో 62 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి పేదల గూడుకు సహకారం అందించామన్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం కోసం రూ.13,500 కోట్లు ఖర్చు అవుతున్నా ప్రభుత్వం వెనుకాడడం లేదన్నారు. మధిర నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటానని చెప్పారు. అనంతరం గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల వారు కాంగ్రెస్‌లో చేరగా భట్టి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఆర్అండ్‌బీ ఈఈ తామేశ్వర్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, ఏడీఏ విజయచందర్, డీఎల్‌పీఓ రాంబాబు, గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరావు, మధిర, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు బండారు నరసింహారావు, అంబటి వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్, నాయకులు దొండపాటి వెంకటేశ్వరరావు, నూతి సత్యనారాయణ, గాలి దుర్గారావు, పైడిపల్లి కిషోర్‌కుమార్, బందం శ్రీను, సుధీర్‌బాబు, బ్రహ్మయ్య, కరివేద సుధాకర్ పాల్గొన్నారు.

తేలిన 'పంచాయతీ'

- సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు
- గ్రామాల్లో ప్రారంభమైన సందడి



ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఒక్కో అడుగు ముందుకు పడుతోంది. ఇప్పటికే జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్ల ప్రక్రియను అధికారులు శనివారం ప్రకటించగా.. సర్పంచ్, వార్డులు, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లను ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ఇప్పటి వరకు తమ గ్రామం, వార్డు, ఎంపీటీసీ స్థానం ఎవరికి రిజర్వ్ అవుతుందోనని పల్లె ప్రజలు ఆతృతగా ఎదురుచూడగా, ఈ రిజర్వేషన్ల ప్రక్రియతో గ్రామాల్లో ఎన్నికల సందడి మరింత ఊపందుకోనుంది.

రిజర్వేషన్ల వివరాలిలా..

సర్పంచ్	స్థానాలు	వార్డులు
షెడ్యూల్ ఏరియాలో		
ఎస్టీ(మహిళ)	48	280
ఎస్టీ(జనరల్)	51	311
100 శాతం ఎస్టీ జీపీల్లో..		
ఎస్టీ (మహిళ)	4	42
ఎస్టీ(జనరల్)	7	42
నాన్ షెడ్యూల్ ఏరియాలో..		
ఎస్టీ(మహిళ)	25	194
ఎస్టీ(జనరల్)	36	292
ఎస్సీ(మహిళ)	48	375
ఎస్సీ(జనరల్)	62	560
బీసీ(మహిళ)	87	642
బీసీ (జనరల్)	103	832
జనరల్ మహిళ	44	570
జనరల్	56	791

571 జీపీలు, 283 ఎంపీటీసీలు..

జిల్లాలో 571 గ్రామ పంచాయతీలు, 5,214 వార్డులు, 283 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించారు. ఇందులో షెడ్యూల్, నాన్ షెడ్యూల్ ఏరియాల వారీగా రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుండగా ఆ ప్రకారం అధికారులు చర్యలు తీసుకున్నారు. రిజర్వేషన్ల ప్రకటనతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

న్యూస్‌రీల్

మహాచండీ అలంకరణలో అమ్మవారు

జమలాపురంలో కొనసాగుతున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



శ్రీ మహాచండీగా దర్శనమిస్తున్న అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో అమ్మవారు ఆదివారం మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు తెల్లవారుజామున శ్రీవారికి పంచామృతాభిషేకం చేశారు. ఆ తర్వాత సౌరసూక్త హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్ శర్మ, రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి : రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.10 గంటలకు నేలకొండపల్లి మండలం అమ్మగూడెంలో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. 10.40 గంటలకు కొరట్లగూడెంలో పర్యటించనున్నారు. 11.10 గంటలకు కోనాయిగూడెం, 11.40 గంటలకు నేలకొండపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం తర్వాత ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

పామాయిల్ ఫ్యాక్టరీ పనుల పరిశీలన

వేంసూరు : మండల పరిధిలోని కల్లూరుగూడెంలో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ పనులను ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీఎం సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్, మేనేజర్ నాగబాబు పాల్గొన్నారు.

నాలుగు రోజులుగా మున్నేరులో మృతదేహం

- ప్రకాశ్‌నగర్ చప్టా వద్ద సుడిగుండంలో చిక్కుకుపోయిన వైనం
- క్రేన్‌ల సాయంతోనూ వెలికితీయలేని పరిస్థితి
- రెస్క్యూ ఆపరేషన్‌లో పోలీస్, ఫైర్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు



క్రేన్‌తో మృతదేహాన్ని వెలికి తీసేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) గల్లంతైన బందెల వెంకటేశ్వర్లు (ఫైల్)

ఖమ్మంక్రైం : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన వ్యక్తి నాలుగు రోజుల క్రితం చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు ఆకేరులో పడి గల్లంతయ్యాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో మున్నేరు ఉధృతి పెరగడంతో గల్లంతైన వ్యక్తి మృతిచెందగా.. ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ చప్టా వద్ద గల సుడిగుండంలో చిక్కుకుని అక్కడే తిరుగుతున్న మృతదేహాన్ని త్రీటౌన్ పోలీసులు గుర్తించారు. శనివారం సాయంత్రం నుంచి మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నా మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అక్కడికి వెళ్లేందుకు ఎవరూ ధైర్యం చేయలేదు. దీంతో ఆదివారం ఉదయం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు సమాచారం అందించగా వారు కూడా సాయంత్రం వరకు ప్రయత్నించినా మృతదేహం ఉన్న ప్రాంతానికి చేరుకోలేకపోతున్నారు. రెండు పెద్ద క్రేన్ల ద్వారా వెళ్లినా సాధ్యం కాలేదు.

రాత్రంతా అక్కడే కాపలా..

గల్లంతైన వ్యక్తి డోర్నకల్‌కు చెందిన బందెల వెంకటేశ్వర్లు(43)గా పోలీసులు గుర్తించడంతో అతడి భార్య విజయ, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఖమ్మంలోని ప్రకాశ్‌నగర్ మున్నేటి ఒడ్డుకు చేరుకుని శనివారం సాయంత్రం నుంచి అక్కడే రోదిస్తూ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తారేమోనని ఎదురుచూస్తున్నారు. కాగా, ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో మృతదేహం ప్రకాశ్‌నగర్ నుంచి కొట్టుకుపోయిందని, అది ఎక్కడ తేలేది తెలియదని సీఐ మోహన్‌బాబు వెల్లడించారు. గల్లంతై నాలుగు రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయి ఉందన్నారు. మృతదేహం కొట్టుకుపోయిందని తెలియడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం గావించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దసరా సెలవులు, ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

9 కి.మీ.. 900 గుంతలు!

- పల్లిపాడు, ఏన్కూరు రోడ్డులో అడుగడుగునా గోతులే..
- నరక ప్రాయంగా మారిన ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



లాలాపురం వద్ద గుంతలమయంగా రోడ్డు



జమ్మికోయ బంజర వద్ద గుంతలు పడిన రహదారి

కొణిజర్ల: ఉన్నది 9 కిలోమీటర్ల రోడ్డు.. కానీ 900కు పైగా గుంతలున్నాయంటే ఆ రహదారిలో ప్రయాణం ఎలా ఉంటుందో ఊహించుకోండి.. ఈ గుంతల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు పడి పలువురు ప్రయాణికులు గాయపడగా, వాహనాలు ధ్వంసమయ్యాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

పల్లిపాడు టు ఏన్కూరు..

కొణిజర్ల మండలం పల్లిపాడు నుంచి అంజనాపురం, జన్నారం మీదుగా ఏన్కూరు మండల కేంద్రం వరకు 2018లో డబుల్ రోడ్డు నిర్మించారు. ఖమ్మం – భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడేన్ని కలిపేందుకు ఇది దగ్గరి దారి. ప్రస్తుతం ఆ రోడ్డు గుంతలమయం కాగా ప్రయాణం నరకప్రాయంగా మారింది. పల్లిపాడు నుంచి అంజనాపురం వరకు ప్రతీ రెండడుగులకో గుంత చొప్పున రోడ్డు జల్లెడ మాదిరిగా తయారైంది. ఆ తర్వాత నాలుగు కి.మీ.దూరంలో ఏన్కూరు ఉండగా.. ఆ రోడ్డు పరిస్థితి అధ్వానంగానే ఉంది. వర్షాకాలం కావడంతో గోతుల్లో నీరు నిండగా ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొణిజర్ల మండలం తీగలబంజరకు చెందిన ఓ యువకుడు మూడు నెలల క్రితం గుంతను తప్పించబోయి కిందపడి కోమాలోకి వెళ్లి మూడు రోజుల చికిత్స అనంతరం మృతి చెందాడు. లాలాపురానికి చెందిన ఓ యువకుడు కారులో ప్రయాణిస్తుండగా గుంతలో టైరు దిగబడి రిమ్ము పూర్తిగా ధ్వంసం కాగా రూ.50వేలకు పైగా నష్టపోయినట్లు తెలిపాడు. ఇక లాలాపురం – తీగలబంజర మధ్య పగిడేరుకు వరద వస్తే రోడ్డు కొట్టుకుపోయి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ఏటిపై నిర్మించిన చప్టాకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ రోడ్డును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిన ప్రభుత్వం 40 శాతం, ప్రైవేట్ సంస్థలు 60 శాతం వాటా ధనంతో పునఃనిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అయితే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

శిథిలావస్థలో కల్వర్టులు..

2018లో రోడ్డు నిర్మించినప్పుడు ఆర్అండ్‌బీ అధికారులు కల్వర్టుల నిర్మాణాలపై ప్రతిపాదనలు రూపొందించకపోవడంతో పాత కల్వర్టులపైనే రోడ్డు వేశారు. ప్రస్తుతం ఆ కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పల్లిపాడు సమీపంలో కల్వర్టు కూలగా పైపువేసి మట్టితో పూడ్చారు. లాలాపురం–తీగలబంజర సమీపంలో కల్వర్టులు కుంగి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అంజనాపురం సమీపంలో నిమ్మవాగుపై నిర్మించిన లో లెవల్ చప్టా కూడా కూలేందుకు సిద్ధంగా ఉంది.

భయపడుతూ ప్రయాణిస్తున్నాం



పల్లిపాడు నుంచి అంజనాపురం వరకు రోజూ ఆటో తిప్పుతుంటా. ఈ 9 కి.మీ. ప్రయాణం చేయడానికి గంటకు పైగా పడుతోంది. గుంతల్లో పడి ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి పూట ఈ రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే భయపడుతున్నాం. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలి.

– ముత్తనబోయిన లెనిన్, ఆటో డ్రైవర్, తీగలబంజర

బైక్‌కు రూ.10 వేలు ఖర్చయింది



పల్లిపాడు నుంచి సింగరాయపాలెం వరకు రోజూ ద్విచక్ర వాహనంపై తిరుగుతుంటా. ఈ క్రమంలో గుంతలో పడినా బైక్ ధ్వంసమైంది. రిపేర్ చేయిస్తే రూ.10 వేలు ఖర్చయ్యాయి. రోడ్డు గుంతల మయంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుపై తిరగాలంటేనే భయంగా ఉంటోంది.

– షేక్ నాగుల్‌మీరా, సింగరాయపాలెం

ప్రతిపాదనలు పంపాం

పల్లిపాడు – ఏన్కూరు రోడ్డు నిర్మాణానికి ఏడాది క్రితమే ప్రతిపాదనలు పంపించాం. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు రోడ్డు మరమ్మతు చేయడం సాధ్యం కాదు. ఇప్పటికే రెండు సార్లు మడ్ మిక్స్‌తో గుంతలు పూడ్చి వేయించాం. వర్షాలు తగ్గితే రోడ్డు మరమ్మతు చేయిస్తాం.

– మోదేపల్లి రమేష్, ఆర్అండ్‌బీ డీఈ, వైరా

అంతరాయం లేని విద్యుత్ సరఫరా

ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి వెల్లడి



రావినూతలలో బ్రేకర్లను ప్రారంభిస్తున్న శ్రీనివాసాచారి

బోనకల్: అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి అన్నారు. మధిర 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి బోనకల్ సబ్‌స్టేషన్‌కు సరఫరా అవుతున్న 33 కేవీ లైన్లకు ప్రత్యామ్నాయంగా పెద్దగోపతి సబ్‌స్టేషన్ నుంచి రావినూతల వరకు నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేయగా బ్రేకర్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధిర 133 కేవీ సబ్ స్టేషన్ నుంచి సరఫరా అవుతున్న విద్యుత్ లైన్లలో ఏదైనా అంతరాయం ఏర్పడితే పెద్దగోపతి 133 కేవీ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేసేందుకు వీలుగా రూ.70లక్షల వ్యయంతో లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రావినూతల విద్యుత్ కేంద్రం నుంచి జానకీపురం, మోటమర్రి, సిరిపురం ఉపకేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరాకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైరా డీఈ బండి శ్రీనివాసరావు, సబ్ డివిజన్ ఏడీఈ పి.కిరణ్‌కుమార్, ఏఈటీ మనోహర్, బోనకల్ ఏఈ సాయికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ మార్కెట్ తనిఖీ


సన్నబియ్యాన్ని పరిశీలిస్తున్న రాయల నాగేశ్వరరావు

వైరా: స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్ర గిడ్డంకుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆదివారం తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్నబియ్యాన్ని పరిశీలించారు. చౌకదుకాణాలకు సరఫరా చేసే సన్న బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వికాస వేదిక నూతన కమిటీ ఏర్పాటు

ఖమ్మంగాంధీచౌక్: వికాస వేదిక సాహిత్య సంస్థ నూతన కమిటీని ఆదివారం ఖమ్మంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాజుల భారతి శ్రీనివాస్, కార్యదర్శిగా తిరునగరి శ్రీనివాసరావు, కోశాధికారిగా సునీత, గౌరవాధ్యక్షులుగా తులసీదాస్, ఉపాధ్యక్షులుగా మలిశెట్టి కృష్ణమూర్తి, ఐలయ్య, బి నాగేశ్వరరావు, చిన్న హుస్సేన్, పుల్లయ్య, వసంత, సహాయ కార్యదర్శులుగా కట్టికోల చిన్న నర్సయ్య, నల్ల కృష్ణ, శైలజ, శోభనాద్రి వీరబాబు, సంగమేశ్వరరావు, అధికార ప్రతినిధులుగా కె. కృష్ణారావు, గోవింద్, న్యాయ సలహాదారుగా సాయి శ్రీనిజ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి బుక్క సత్యనారాయణ అధ్యక్షత వహించగా, నామవరపు కాంతేశ్వరరావు, లెనిన్ శ్రీనివాస్, సాధనాల వెంకటస్వామి నాయుడు, శంకర్ రెడ్డి, వెంకటకృష్ణ, ఆవుల వీర భద్రం, విజయరామరాజు, జయవాసు, రామయ్య, జహీరుద్దీన్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో మధిర కళాకారులు


కస్తూరి తిలకం పద్య నాటకంలో ఓ సన్నివేశం

మధిర: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలిలో కళల కాణాచి సంస్థ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్ కళాకారులు ఆదివారం ప్రదర్శించిన కస్తూరి తిలకం పద్య నాటకం అలరించింది. ఈనెల 27 నుంచి అక్టోబర్ 2 వరకు తెనాలిలో జాతీయస్థాయి పద్య నాటక పోటీలు జరుగుతున్నాయి. ఈ పద్య నాటకానికి డాక్టర్ నిభానుపుడి సుబ్బరాజు దర్శకత్వం వహిస్తూ సోమగిరి పాత్ర ధరించారు. బిల్వమంగళుడిగా చిలువేరు శాంతయ్య, స్థానాపతిగా నరాల సాంబశివారెడ్డి, కాకతీయ రాజుగా రామవరం ప్రసాద్‌తో పాటు కిషోర్ రెడ్డి, రాజేశ్వరరావు, ఇనపనూరి వసంత్ వివిధ పాత్రలు ధరించారు. ప్రముఖ సినీ సంభాషణ రచయిత బుర్ర సాయిమాధవ్ కళాకారులను అభినందించారు.

షిరిడీలో బోనకల్ వాసి ఆత్మహత్య


వినోద్ (ఫైల్)

బోనకల్: మండలంలోని రాయన్నపేట గ్రామానికి చెందిన యువ వైద్యుడు మహారాష్ట్రలోని షిరిడీలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రా మానికి చెందిన మరీదు కిశోర్ – కోటేశ్వరి దంపతుల ఏకైక కుమారుడు వినోద్ (30) రష్యా లో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. పెడియాట్రిక్‌లో ఎండీ చేసేందుకు గాను మహారాష్ట్రలోని షిరిడీలో ఓ ప్రైవేట్ వైద్య కళాశాలలో చేరాడు. 6 నెలల్లో కోర్సు పూర్తికానుంది. వైద్య కళాశాలలో కొందరు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపానికి గురైన వినోద్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడిని వైద్యుడిగా చూసుకుందామనుకున్న తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. మృతదేహాన్ని రాయన్నపేటకు తీసుకొస్తున్నారు.

వాణిజ్య పంటలకు స్వస్తి..

- పందిరి కూరగాయల సాగుతో అధిక లాభాలు
- డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అంతరపంటల సాగు
- దశాబ్దకాలంగా ఉద్యానవన పంటలు పండిస్తున్న రైతులు
- పొరుగు రాష్ట్రాలకు వెళ్లి సాగు పద్ధతుల పరిశీలన


కూరగాయలు కోస్తున్న కూలీలు (ఫైల్)


పందిరి విధానంలో బీరసాగు

బోనకల్: పెరిగిన ఖర్చులు, తగ్గుతున్న దిగుబడులు, గిట్టుబాటు ధర లేకపోవడంతో వాణిజ్య పంటలకు స్వస్తి చెప్పి ఉద్యానవన పంటలు సాగుచేస్తూ దశాబ్ద కాలంగా లాభాలు గడిస్తున్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో సుమారు 30 మంది రైతులు ఉద్యానవన పంటలను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తమకు ఉన్న కొద్దిపాటి భూముల్లో కాలానుగుణంగా ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటల దిగుబడి తగ్గడంతో పాటు గిట్టుబాటు ధర లేకపోవడం, సేద్యానికి అయ్యే ఖర్చు పెరగడం, చీడపీడలు ఆశించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో వినూత్న రీతిలో కూరగాయల సాగుతో పాటు బంతి, చామంతి, కనకాంబరాలు, గులాబీ, లిల్లీలు, పండ్ల తోటలైన జామ, బొప్పాయి పంటలను అంతర పంటలుగా సాగు చేస్తున్నారు.

పందిరి విధానంతో..

తొలకరి జల్లులు పడగానే పత్తివేసే సమయంలో పందిరి విధానంలో కాకర, బీర, దొండ పంటలు వేస్తున్నారు. ప్రస్తుతం కాకర నెల రోజుల నుంచి కోస్తున్నారు. వేసిన 40 రోజుల తరువాత పంట చేతికి వస్తుంది. మొత్తం 90 రోజుల్లో పంట దిగుబడి కాలం పూర్తి అవుతుంది. విత్తనాలను బెంగళూరు నుంచి హైబ్రీడ్ రకం తెప్పించి విత్తారు. ఎకరం బీర, దొండ, కాకర విత్తనాలను కొనుగోలు చేయడానికి రూ.10 – రూ.15 వేలు ఖర్చు వస్తున్నట్లు రైతులు తెలిపారు. పశువుల ఎరువులు, ఇతర పురుగుమందులకు ఎకరానికి రూ.25 వేలు, కూలీలు, ఇతర ఖర్చులు రూ.30 వేలు అవుతున్నట్లు రైతులు తెలిపారు. ఇప్పటివరకు ఎకరాకు 80 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావడంతో మండలంలోని పలు గ్రామాల వ్యాపారులతో పాటు ఖమ్మం మార్కెట్‌కు తరలిస్తున్నారు. సీజన్ పూర్తి అయ్యే వరకు ఎకరానికి రూ.3 లక్షల ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు. బీర, బెండ, దొండ, కాకర పూర్తయిన తరువాత అదే భూమిలో టమాట సాగు చేస్తామని రైతులు తెలిపారు.

అంతర పంటల సాగు

రైతులు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా అంతర పంటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది బంతిలో అంతర పంటగా బొప్పాయి, గులాబీలో మల్లెలు సాగు చేస్తున్నారు. బంతి 120 రోజుల వ్యవధిలో పెట్టుబడి పోను రూ.లక్ష ఆదాయం వస్తుంది. ప్రస్తుతం వంగ సాగుకు సంబంధించి కింద అడవి వంగ, పైన గ్రాఫ్టింగ్, అంకూర్ నితీశ్ వంటి వెరైటీ వంగ మొక్కలను హైదరాబాద్‌లోని ఉద్యానవన నర్సరీ నుంచి తెప్పించి సాగు చేస్తున్నారు. ఇది గత ఏప్రిల్‌లో వేయగా జూన్ 12 నుంచి కోత కోస్తున్నారు. వారానికి 10 క్వింటాళ్ల చొప్పున కోత కోస్తున్నారు. మొత్తం రూ.3 లక్షల వరకు ఆదాయం రాగా ఖర్చు రూ.1.5 లక్షలు పోతుందని వివరించారు.

వినూత్న పద్ధతిలో సాగుచేస్తే లాభాలు..



వినూత్న పద్ధతిలో సాగు చేస్తే ఉద్యానవన పంటల నుంచి మంచి లాభాలు గడించవచ్చు. ఆదునిక పద్ధతిలో సాగు మెళకవలను తెలుసుకునేందుకు మహారాష్ట్ర, పాండిచ్చేరీ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లి వచ్చాం. గులాబీ, చామంతి సాగు విధానాలను చూసి ఇక్కడ అమలుచేస్తున్నాం, ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు తీసుకుంటున్నాం. –బొడ్డుపల్లి నాగచంద్రుడు, ముష్టికుంట్ల

ఏడాదిలో మూడు పంటలు..



మిర్చి తోటలు వేసి తీవ్రంగా నష్టపోయాను. ఉద్యాన పంటలపై వచ్చే లాభాలను తెలుసుకొని 10 ఏళ్లుగా సాగు చేస్తున్నాను. సీజన్ పండుగలను బట్టి పూల రకాలను సాగు చేస్తున్నాను. రవాణా సౌకర్యం కష్టతరమైనప్పటికి లాభాలు వస్తుండడంతో పూల తోటల సాగు క్రమం తప్పకుండా చేస్తున్నాను.

–బొడ్డుపల్లి నరసింహారావు, ముష్టికుంట్ల

ఉద్యాన సాగు లాభదాయకం



మండలంలోని ముష్టికుంట్ల, ఆళ్లపాడు, మోటమర్రి, బోనకల్ గ్రామాల్లోని రైతులు ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ముష్టికుంట్ల గ్రామానికి చెందిన రైతులు ఎక్కువగా ఈ పంటలను సాగు చేస్తూ మంచి లాభాలను గడిస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలను తీసుకొని ముందుకు సాగుతున్నారు.

–విష్ణు, ఉద్యానవన శాఖ అధికారి

అవగాహన కల్పిస్తూ ఆఫ్ మారథాన్

ఖమ్మంస్పోర్ట్స్/కామేపల్లి: మరో 24 గంటల్లో రిటైర్డ్ కాబోతున్న ఓ పోలీస్ అధికారి ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కాంక్షిస్తూ 21 కిలోమీటర్ల ఆఫ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. నగరంలోని ఇంటెలిజెన్స్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న సిరిపురపు పుల్లయ్య ఆదివారం కామేపల్లి మండలంలోని ముచ్చర్ల నుంచి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం వరకు 21 కిలోమీటర్ల ఆఫ్ మారథాన్‌ను 2 గంటల 15 నిమిషాల్లో పూర్తి చేశాడు. తన స్వగ్రామం నుంచి లయన్స్‌క్లబ్ సభ్యులతో కలిసి ఉదయం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి సర్దార్ పటేల్ స్టేడియానికి ఉదయం 8.45 గంటలకు చేరుకున్నాడు. పుల్లయ్య వెంట 30 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. ఖమ్మం గణేశ్ ఫంక్షన్ హాల్ వద్ద ఆయనకు ఇంటలిజెన్స్ అడిషనల్ ఎస్పీ రామోజీ రమేశ్, డీఎస్పీ వెంకన్నబాబు, వైవీ ప్రసాద్, శ్రీనివాసరావు స్వాగతం పలికారు. పుల్లయ్య మాట్లాడుతూ..

ఎన్నో ఒత్తిళ్లు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ, వైద్యుల సూచన మేరకు పరుగు, ఈత, టెన్నిస్ ఇతర క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకున్నానని తెలిపారు. యోగా, ఈత, వ్యాయామం వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. కాగా, రహీం, అమరయ్య, నర్సింహారెడ్డి, సురేశ్, స్నేహసాగర్, దస్తగిరి, రాధాకృష్ణ, ఆదినారాయణ, కొండల్‌రావు, నర్సింహారెడ్డి, జాఫర్, రంగారావు, ఆవుల హరీశ్, ఖాదర్ తదితరులు పుల్లయ్యను అభినందించారు.

కుల వ్యవస్థ అంతానికి కృషి చేయాలి

తిరుమలాయపాలెం: జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో కుల నిర్మూలనకు కృషి చేద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్లైన్ రాష్ట్ర నాయకుడు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో పాలేరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కుల వ్యవస్థ నిర్మూలన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక్ సమాజ్ సంస్థను ఏర్పాటు చేసి, అంటరానితనం పోవాలని, దేశంలో కుల నిర్మూలన జరగాలని పోరాడారన్నా రు. ఎంతో అభివద్ధి సాధించినా కుల భావ నలు కొనసాగుతున్నా యని తెలిపారు. ఈ సందర్భంగా పిండిప్రో లు గ్రామంలో కులాంతర వివాహాలు చేసుకున్న మూడు జంటలకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గోకినపల్లి వెంకటేశ్వరరావు, రేపాకుల శివలింగం, కమ్మకోమటి నాగేశ్వరరావు, మల్లిడి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, పులిగుజ్జు వెంకటస్వామి, ఆరెంపుల వెంకన్న, బానోత్ శంకర్, గొడుగు విజయ్, గోకినపల్లి సరోజిని, రెంటాల యాదగిరి, చిరంజీవి, పి.ఉప్పలయ్య, టి.నాగేశ్వరరావు, మహంకాళి ఉప్పలయ్య, చుంచు వెంకన్న, మీగడ సత్యం, రాయిండ్ల వెంకటమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.

ములుగు డిప్యూటీ కలెక్టర్‌గా కాకరవాయి వాసి


సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న ఖుషీల్‌వంశీ


సీఎం చేతుల మీదగా నియామకపత్రం అందుకుంటున్న వంశీకృష్ణ

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి గ్రామానికి చెందిన కొత్తపల్లి ఖుషీల్‌వంశీ శనివారం రాత్రి హైదరాబాద్ శిల్పకళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా డిప్యూటీ కలెక్టర్‌గా నియామకపత్రం అందుకోగా వెంటనే పోస్టింగ్ ఇచ్చారు. ములుగు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాకరవాయి గ్రామానికి చెందిన కొత్తపల్లి శివకుమార్, రేణుక దంపతుల కుమారుడు ఖుషీల్‌వంశీ ఇప్పటికే నాలుగు కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలు సాధించగా గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 63వ ర్యాంకు, రిజర్వేషన్ కేటగిరిలో 3వర్యాంకు సాధించాడు. ఆయన్ను గ్రామస్తులు, అధికారులు అభినందించారు.

ఎంపీఓగా పడాల రమేష్..

తల్లాడ: మండడలంలోని బాలపేటకు చెందిన పడాల రమేష్ బాబు గ్రూప్–2లో ప్రతిభ సాధించి ఎంపీఓగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. తన తండ్రి చిన్నప్పుడే మృతి చెందగా.. తల్లి, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే ఈ ఉద్యోగం సాధించానని రమేష్ తెలిపారు.

కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా..

తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిదేవర వెంకటేశ్వరరావు గ్రూప్–2లో ప్రతిభ కనబర్చి కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యారు. తండ్రి కాశేశ్వర్‌రావు చిన్నతనంలోనే చనిపోగా తల్లి రుక్మిణి ప్రోత్సాహంతో కష్టపడి చదివి ఈ కొలువు సాధించానని చెప్పారు. కాగా, ఆయనకు 2018లో పంచాయతీ కార్యదర్శిగా, 2019లో అటవీశాఖలో బీట్ ఆఫీసర్‌గా, 2020లో విద్యుత్‌శాఖలో జేఏఓగా ఉద్యోగాలు కూడా రావడం విశేషం. కాగా, నారాయణపురం గ్రామానికి చెందిన రెడ్డెం రామకోటారెడ్డి ఎంపీఓగా, పినపాకకు చెందిన ఎక్కిరాల ప్రశాంత్ కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యారు.

ఆటోవాలా కుమారుడు ఎంపీడీఓ..

కల్లూరు: మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన కంచెపోగు వంశీకృష్ణ గ్రూప్–1లో ప్రతిభ కనబర్చి ఎంపీడీఓ ఉద్యోగం సాధించగా.. సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఆయన తండ్రి రాములు ఆటో డ్రైవర్ కాగా, తల్లి సుశీల వ్యవసాయ కూలీ. తన చదువుకు తల్లిదండ్రులతో పాటు సోదరుడు నాగరాజు ప్రోత్సాహం, సహాయం దోహద పడ్డాయని వంశీకృష్ణ తెలిపారు.

భద్రకాళి అలంకరణలో మారెమ్మతల్లి


అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకుడు

ఖమ్మంరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ మారెమ్మతల్లి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. కాగా, అమ్మవారు ఆదివారం భద్రకాళి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, చండీహోమం, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.జగన్ మోహన్‌రావు, ప్రధానార్చకులు కాశావజ్జుల రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

22 కేజీల గంజాయి పట్టివేత


గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మధిర: అంబారుపేట చెరువుగట్టు సమీపంలో ఆదివా రం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు 22 కేజీల ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేశ్, ఏఈఎస్‌కే తిరుపతి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సీహెచ్ శ్రీహరిరావు, సిబ్బంది కలిసి అంబారుపేట చెరువు కట్ట సమీపంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన సిమెంట్ రంగు సూట్ కేసును పరిశీలించి చూడగా అందులో 22 కేజీల ఎండు గంజాయి లభించింది. పరిసరాల్లో గాలించగా ఎవరూ కనిపించలేదు. విచారణ నిమిత్తం గంజాయిని మధిర ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కరీం, బాలు, సుధీర్, వెంకట్, హనుమంతరావు, వీరబాబు, స్వరూప, ఉపేందర్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: నగరంలోని కైకొండాయిగూడెంకు చెందిన గ్రానైట్ కార్మికుడు గొర్రెపాటి వెంకటేశ్వర్లు (48) ఆర్థిక సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఖమ్మంఅర్బన్ (ఖానాపురంహవేలి) పోలీస్ స్టేషన్లో ఆదివారం కేసు నమోదైంది. సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. గొర్రెపాటి వెంకటేశ్వర్లు గ్రానైట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆర్థికసమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆయన ఆదివారం ఉదయం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ కుమార్తె వివాహమైంది. మృతుడి సోదరుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కారేపల్లి: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన విశ్వనాథపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దొంతు దాసు పాడి గేదెను ఆదివారం గ్రామ సమీపంలోని సువాబుల్ తోటకు మేతకు తీసుకెళ్లాడు. తోటలో వ్యవసాయ బావులకు వెళ్లే విద్యుత్‌లైన్ తెగి పడటంతో అది తాకి గేదు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన దాసు విద్యుత్ అధికారులకు ఫోన్‌లో సమాచారం అందించగా సరఫరా నిలిపివేశారు.

నవ్వించిన 'ఆనందో బ్రహ్మ'


స్కిట్స్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న నటులు, రచయితలు, ప్రముఖులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆనందో బ్రహ్మ'కార్యక్రమాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. హాస్యనటులు(జబర్దస్త్) అప్పారావు, గడ్డం నవీన్, మోహన్ ప్రేక్షకులను నవ్వించారు. డ్రామా జూనియర్స్ వండర్ కిడ్ గుణసాయి తన స్కిట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తడాఖా విన్నర్ బాబాషరీఫ్ మిమిక్రీ, ఇంద్రజాలకుడు కేవీ చారీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫైర్ డ్యాన్సర్ ఈశ్వర్ బహదూర్, కమెడియన్ జల్లేపల్లి రమేశ్, మిమిక్రీ సుధాకర్ అభినయం ప్రేక్షకుల మెప్పుపొందింది. బీబీ సుప్రజాదేవి భరతనాట్యం, సంతోష్ అకాడమీ నృత్యాలు అలరించాయి. పంజా మాలతి, ఎస్వీ రమణ, శేఖర్ బాబు, ఎస్.ప్రకాష్, సత్యానందం, గణపతిరాజు పాడిన పాటలు ఉర్రూతలూగించాయి. కార్యక్రమానికి తొలుత నటులు, రచయిత ఎస్.కాంతేశ్వరరావు, మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత మొగిలి గుణకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన సభకు న్యాయవాది జల్లా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా, మిత్రా గ్రూప్స్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్, హార్వెస్ట్ విద్యాసస్థల ప్రతినిధి పార్వతిరెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారి రుద్రాక్షల మల్లేశం, డాక్టర్ కాపా మురళీకృష్ణ తదితరులు మాట్లాడుతూ.. 'ఆనందో బ్రహ్మ'వంటి కామెడీ కార్యక్రమాలను మొగిలి ఎంటర్‌టైన్ మెంట్స్ సంస్థ నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు జగదీశ్, నర్సింహారావు, కమర్తపు శ్రీధర్, కొత్తపల్లి శేషు, మద్దెల శివకుమార్, నాగసాయి, విద్యాసాగర్, రవితోష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.


స్కిట్ చేస్తున్న అప్పారావు, మొగిలి గుణకర్ తదితరులు